


మా వారి పేరు సుమన్ బాబు పెళ్లికి ముందాపేరు విని వంకుల జుత్తుతో, చక్రాల్లాంటి కళ్లలో, బెల్ బాటమ్ వేసుకున్న సౌందర్య రూపాన్ని ఊహించుకున్నాను ఆయనేదో థీసిస్ సబ్మిట్ చేసే గొడవల్లో ఉండటంవల్ల, సదరు సుమన్ బాబుగారి తండ్రిగారు — మా నాన్నగారు బాల్యస్నేహితులు కావడంవల్ల పెళ్లిచూపులు తతంగం లేకుండానే మా మూడు ముళ్ల ముచ్చటకి ముహూర్తాన్ని నిర్ణయించేశారు ఆ నిర్ణయం చేసిన ముహూర్తానికి నా ఊహాలోకంలోని రాజకుమారుడిలా కాక బట్టతలతో, చెవికొరకాడతో, లొటా లొటా ప్యాంటుతో, 'బాంబుషెల్' లని ముద్దుగా పిలవబడుతున్న సుమన్ బాబు నా జీవితంలోకి ప్రవేశించాడు

కాలేజీ నుంచి వస్తూనే 'ఆశా' అని పిలుస్తూ ఎంతో అనురాగంలో నన్ను దగ్గరకు తీసుకొని మల్లెపూలని నా సిగలో తురుముతారని, స్కూటర్ వెనుక కూర్చోబెట్టుకుని 'జయ్' మంటూ సినిమాలకనీ, పార్కులకని తీసికెళ్తారని ఎంతో ఆశపడ్డాను కాని చెమటలు క్రక్కుతూ కిర్రు కిర్రుమంటున్న డొక్కు సైకిల్ని అతి కష్టంమీద త్రొక్కుకుంటూ కాలేజీ నుంచి వస్తున్న శ్రీవార్ని చూడగానే నా ఉత్సాహమంతా జావగారిపోయింది

శ్రీ వా రి తో సినిమాకెళ్లాలన్న వేధవ కోరికొకటి నాకు కలిగింది కాని నాకుగా నేనే బయటపడ అడిగేకంటె ఆయనే ఆ పని చేస్తే బాగుంటుందని ఎంతో ఆశతో రోజులు దొర్లించ సాగాను ఆయన మాత్రం ఆదివారం వచ్చిందంటే చాలు బామ్మగారితో కబుర్లు చెప్తూ గుగ్గిళ్లు తింటూ కూర్చుంటారే గాని నే నంటూ ఒక మనిషి నున్నానన్న సంగతే మర్చిపోతారు ఇహ మౌనానికి తావు లేదనుకుని, కాలేజీ నుంచి వచ్చి డబుల్‌కాట్ బెడ్‌మీద [అది మా కన్నవారిచ్చిందే లెండి] అపర శ్రీహరిలా పడుకుని కెమిస్ట్రీ బుక్ చదువుతున్న శ్రీవారి చెంతకు చేరి, నడినెత్తి మీద మిగిలున్న నాలుగు వెంట్రుకలు ఎక్కడూడిపోతాయోనని అతి జాగ్రత్తగా లాలనగా నిమురుతూ 'మనస్సులోని మాట బయటపెట్టాను' అంతే!! ప్రక్కన బాంబు ప్రేలినట్లుగా ఉలిక్కిపడి లేచి కూర్చుంటూ "ఏమిటి ?" అనడిగారు విషయం చెప్పాను. ఎలాగైతేనేం చివరకా జడపదార్థంలో చలనం కలిగింది

"ఏ సినిమా కెళ్దాం" అనడిగారు

శ్రీవారితో కలిసి చూసే మొదటి సినిమా గనుక ఎ సి హాలులో చూడాలని నాఅభిప్రాయం. అందుకే డీలక్స్‌లో ఆడుతున్న "హరే రామ హరే కృష్ణ" సినిమా కెళ్దామన్నాను. అంతలో ఈ మాట లెలాగోగాని వంట చేస్తున్న బామ్మగారి చెవిన పడ్డాయి అంతే!! వంట ఇంట్లోంచి పప్పు మెదుపుతున్న తెడ్డుతోపాటు టి టి ఎక్స్‌ప్రెస్‌లా బెడ్ రూమ్‌లోకి దూసుకొచ్చేసిన బామ్మగారు "ఒక్క అరగంట ఆగండర్రా వంట తయారవుతుంది" అన్నది భోజనాలు చేసి వెళ్ళమంటుంది కాబోలనుకుని "వచ్చిన తర్వాత భోంచేస్తాంలెండి" అన్నాను

"అదిగాదే అమ్మాయ్ సినిమాజూసి చాలా సంవత్సరాలయింది అందులోనూ రామకృష్ణుల సినిమా అంటున్నారు నేనూవస్తా" నన్నది

అంతే!! నా గొంతుకలో వచ్చి వెలక్కాయ పడింది అది రామకృష్ణుల సినిమాగాదు, "దమ్‌మారో దమ్" సినిమా అని చెప్తే చివాట్లుగాదు గడ్డి పెడ్తుంది 'హా హత విధీ!' అనుకుంటూ కుప్పలా కూలిపోయాను.

సరిగ్గా అదే సమయంలో, "అదిగాదే బామ్మా, నిన్నూ సినిమాకి తీసికెళ్దామనుకున్నాను, కాని అన్ని రోజులూ మన రోజులు గావు. ఏ దొంగన్నా ఇది పసిగట్టాడంటే

తాతయ్యా పెద్ద చెంబు ముదలుని ఘాసు వరకు ఎత్తుకుపోతాడు'' అంటూ అపర సైంధవుడ్లా అడ్డుపడ్డారు మావారు తాత గారిగుర్తుగా బామ్మగారికి మిగిలున్న మురుగు లన్నా పెద్దచెంబన్నా ఆమెకు పంచప్రాణాలు. అందువల్లనే శ్రీవారి మాటలు పాశు పతాస్త్రంలా ఆమెపై పనిజేశాయి.

''అదీ నిజమేనురోయ్'' అంటూ పప్పు గుత్తితోపాటు వంట ఇంట్లోకి ప్రయాణం కట్టింది.

హాట్సాఫ్ శ్రీవారికి. బట్టతలలో కెమిస్ట్రీ ఈక్వేషన్లు మాత్రమే ఉన్నాయనుకున్న నా అభిప్రాయాన్ని అర్జంటుగా తుడిచేసుకోక తప్పలేదు ప్రేమతో ఆ బట్టతల మీద 'టెంగు' మని ఒక మొట్టికాయ వేద్దామను కున్నానుగాని, బెజ్జం పడుతుందేమో ప్రోగ్రాం క్యాన్సిల్ అవుతుందని పోస్టుపోన్ జేశాను. ఎలాగైతేనేం సినిమాకి బయలుదేరాము తీరా వాకిట్లోకి వచ్చామో లేదో ఆటోరిక్షా ఒకటి వచ్చి ఇంటిముందాగింది. అందులో నుంచి సతీ సమేతంగా దిగిన శ్రీవారి కొలీగ్‌ని చూడగానే మా సినిమా ప్రయాణం కంచికి ప్రయాణం కట్టింది

* * *

శ్రీవారు కాలేజీకి వెళ్ళగానే ఈ జీవితాని కిక 'ముద్దూ మురిపెం' లేదనుకుని ఆవేళే వచ్చిన వీక్లీ తిరగేస్తూ కూర్చున్నాను ఒంటి గంట ఆ ప్రాంతంలో వచ్చిన శ్రీవార్నిజూసి ''ఏమిటీవేళ కాలేజీ లేదా'' అనడిగాను. ''నాకు వర్కు లేదులే త్వరగా బయల్దేరు, సినిమా కెళ్దాం'' అన్నారు

'ఈ మాటలన్నది ఈయనేనా!' అని ఆశ్చర్యపోయాను కాని నేను ఆశ్చర్యాన్నుంచి తేరుకోక పూర్వమే ఆయన బాత్‌రూమ్‌లోకి దారితీశారు ఎలాగైతేనేం పావు గంటలో ముస్తాబై సినిమాకి బయలుదేరాం నిన్నటిలా పరిచితులు కనిపిస్తారని శ్రీవారు తొందర పెట్టడంవల్ల రిక్షాలో వెళ్ళటం ఇష్టం లేకున్నా మార్గాంతరంలేక ఈసురోమంటూ రిక్షా ఎక్కాను రిక్షా అర ఫర్లాంగు దూరం వెళ్ళిందో లేదో కాలేజీ కుర్రవాడొకడు మా శ్రీవార్ని విష్ చేశాడు అంతే!! ఉన్న ఫళంగా శ్రీవారి ఛాతి ఆరు అంగుళాలు పెరిగిపోయింది. ఫలితంగా సీట్లో ఆయన ప్రక్కన కూర్చోడం నాకు కష్టమయింది. చిద్విలాసంగా చిరునవ్వులు చిందిస్తూ

''అతను నా స్టూడెంట్... అతనేగాదు నా స్టూడెంటెవరికైనా నేనంటే గౌరవం'' అన్నారాయన.

''హరి పిడుగా! కొట్టవలసిన సమయం లోనే దెబ్బకొట్టావ్... ప్రాక్టికల్స్‌లో మాగ్జి మమ్ మార్క్సు స్కోర్ చేస్తావులే'' స్టూడెంట్ నుద్దేశించి మనస్సులోనే అను కున్నాను.

కాటుకదిద్దిన నా కళ్ళల్లోకి జూస్తూ, ''ఆశా! నువ్వెంత అందంగా ఉన్నావో తెలుసా?'' అన్నారు పెళ్ళైన నాలుగు నెలలకి పెళ్ళాం అందాన్ని గుర్తించిన ట్యూబ్ లైట్ మాష్టర్ని చూడగానే ఈసురో మన్నాను కాని ఎంతైనా నేనూ స్త్రీనేగా! ఆరడుగుల మనిషి, అందునా తాళిగట్టిన భర్త స్వయంగా అందాన్ని మెచ్చుకుంటుంటే ఏ స్త్రీ హృదయం పురివిప్పిన నెమలిలా నాట్యమాడదు? నా బుగ్గని తన పెదవులతో అద్దటానికి కాబోలు ముందుకు వంగిన శ్రీవారు ''నమస్కారం మాస్టారు'' అన్న మాట విని అదిరిపడి తిన్నగా కూర్చుంటూ నిర్జీవమైన నవ్వుని పెదవులపై పులుము కున్నారు. ఆరంగుళాలు పెరిగిన శ్రీవారి ఛాతి అకస్మాత్తుగా తొమ్మిదంగుళాలు తగ్గి పోయింది. బెడ్ రూంలో బుక్సు ముందేసు క్కూర్చుని, ప్రయాణంలో ప్రణయం సాగించడానికి పూనుకున్న శ్రీవారి మీద కోపం వచ్చింది కాని పాల పిడతలా నల్లగా మాడిపోయిన ముఖాన్ని చూడగానే జాలేసింది. లేకుంటే ''మీ శిష్యులకి మీరంటే ఎంత భక్తండీ'' అంటూ ఏడ్పించేదాన్నే. ఎలా గైతేనేం థియేటర్ చేరుకున్నాం హిందీ పిక్చరయినా హౌస్‌ఫుల్ అయింది పిక్చరు ప్రారంభమయింది. ఆ చీకట్లో ఎవరూ చూడరాదని కాబోలు మా వారు పట్టు విడు వని విక్రమార్కుడిలా నా మీదకు వంగారు. కాని వెనకాయన ''మాష్టారూ'' అంటూ మెల్లగా భుజం తట్టి, ''దయచేసి కొంచెం ఎడంగా కూర్చుంటారా'' అన్నాడు పాపం మాష్టారు! హాలులో కూడా చుక్కెదు రయింది బాడ్ లక్

పిక్చరయిపోగానే టిఫిన్ చేద్దామని హోటల్ కెళ్ళాము అప్పుడుగాని జేవురించిన శ్రీవారి ముఖం నార్మల్ స్టేట్‌కి రాలేదు

''హల్లో సుమన్ బాబూ'' అన్న మాట లతో తలెత్తిన శ్రీవారు ఎదురుగా నిల్చున్న ప్రిన్సిపాల్‌గార్ని జూసి నోట మాటరాక అర్జం టుగా బట్టతల తడుముకోసాగారు.

''నీ తలనెప్పి ఎలాగుంది'' అని ప్రక్క నున్న నన్నుజూసి, ''ఓహో ఫ్యామిలీతో వచ్చావన్నమాట ఉంటాను మరి నాకు పనుంది'' అంటూ ముందుకు నడిచారాయన.

అప్పుడు గాని తలనొప్పని పర్మిషన్ తీసికొని వర్కు లేదని నా దగ్గర కోతలు కోశారన్న సంగతి బోధపడలేదు హతోస్మి!! సున్నం గొట్టిన గోడలా తెల్లమొహం వేసు కున్న శ్రీవారి వంక చూడలేక తల దించేసు కున్నాను.

ఆయన చేసింది వెధవపనే కావచ్చు. కాని ఆ పని కూడా నన్ను సంతోష పెట్టటానికీ చేశారనేది నిర్వివాదాంశం అందువల్ల డబుల్ గ్యాస్ సోడాలా ఆ వేళిటినుంచి ఆయన యెడ నాకు ప్రేమ అధికమైంది అందుకే స్టూడెంట్స్ దగ్గర, ప్రిన్సిపాల్ దగ్గర ఆయనెక్కడ తేలికైపోతారోనని శ్రీవారితో కలిసి సినిమా కెళ్ళే ఆలోచనకు స్వస్తి చెప్పాను.

## మందులు వాడితే మనశ్శాంతి ఉండదు!

కొన్ని రకాల మందులు అదేపనిగా వాడేవారికి మానసిక అశాంతి కలిగే ప్రమాదం ఉన్నదట కొన్ని రకాల మత్తుమందులు వాడటంవల్ల 'అకె తీషియా' అనే ఒక రకమైన మానసిక వ్యాధి రావచ్చునని 'అమెరికన్ జర్నల్ ఆఫ్ సైకియాట్రి' అనే పత్రిక వ్రాసింది. కుదురుగా ఒకచోట కూర్చోలేకపోవటం,ఆందోళన పడుతూ అటూ, ఇటూ తిరగటం, ఎప్పుడూ కాళ్ళు కదిలిస్తూ ఉండటం, కాళ్ళతో చప్పుడు చేస్తూ ఉండటం, వళ్ళు అర్థం లేకుండా కదుపుతూ ఉండటం ఈ అకెతీషియా అనే అస్వస్థత లక్షణాలు.